# సాక్షి జగిత్యాల

బుధవారం। 30। ఆగస్టు। 2023






**ఆశ వర్కర్ల ర్యాలీ**

ధర్మపురి: నెల వేతనం రూ.18వేలకు పెంచాలనే డిమాండ్‌తో ఆశ వర్కర్లు మంగళవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు.



**అంజన్నకు మొక్కులు**

కొండగట్టు : కొండగట్టు శ్రీఆంజనేయస్వామిని మంగళవారం వేలాది మంది భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 31.0/23.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు వీచే అవకాశం ఉంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

## న్యూస్‌రీల్

### దిశ సమావేశం వాయిదా

జగిత్యాల: కలెక్టర్ కార్యాలయంలో ఈనెల 30న(బుధవారం) జరగాల్సిన జిల్లా అభివృద్ధి సమన్వయ మానిటరింగ్ కమిటీ(దిశ) సమావేశం అనివార్య కారణాలతో వాయిదా పడినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నరేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు సహకరించాలని ఆయన కోరారు.

### గెలుపోటములు సహజం



పరిచయం చేసుకుంటున్న భారతి

జగిత్యాలఅగ్రికల్చర్: క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజమని వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ భారతి నారాయణభట్ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని పొలాస వ్యవసాయ కళాశాల విద్యార్థులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. భారతి మాట్లాడుతూ, విద్యార్థులు క్రీడా నైపుణ్యాన్ని పెంపొందించేందుకు పట్టుదలతో కృషి చేయాలని సూచించారు. విద్యార్థి వ్యవహారాల అధికారి గౌరిశంకర్, ఎన్‌ఎస్‌ఎస్ అధికారులు సత్యనారాయణరెడ్డి, ఎల్లారెడ్డి పాల్గొన్నారు.

### కుల సంఘాలపై ప్రత్యేక దృష్టి



ప్రొసీడింగ్స్ అందిస్తున్న విద్యాసాగర్‌రావు

మెట్‌పల్లి(కోరుట్ల): కుల సంఘాల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు అన్నారు. పట్టణంలో గీత పారిశ్రామిక సహకార సంఘం కమ్యూనిటీ భవన నిర్మాణానికి రూ.5లక్షల విలువైన ప్రొసీడింగ్స్‌ను మంగళవారం ఆయన అందజేసి మాట్లాడారు. ఉపాధిలేని గీతకార్మికుల కోసం హైదరాబాద్‌లో నీరా కేంద్రం ఏర్పాటు చేసిందని గుర్తుచేశారు. రానున్న ఎన్నికల్లో తమకు మద్దతుగా నిలవాలని ఆయన కోరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుజాత, వైస్‌చైర్మన్ చంద్రశేఖర్‌రావు, నాయకులు సంజయ్, సుధాకర్‌గౌడ్, నర్సగౌడ్, ఆనంద్ గౌడ్, శ్రీనివాస్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

### ప్రజల కోసమే పోలీసులు



మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటస్వామి

పెగడపల్లి(ధర్మపురి): ప్రజల రక్షణ కోసం పోలీస్ వ్యవస్థ పనిచేస్తోందని జగిత్యాల డీఎస్పీ వెంకటస్వామి అన్నారు. సుద్దపల్లి గ్రామంలో మంగళవారం ఉదయం ఎస్పీ భాస్కర్ ఆదేశం మేరకు పోలీస్ కమ్యూనిటీ కాంటాక్టు కార్యక్రమం నిర్వహించారు. ధ్రువీకరణపత్రాలు లేని 53 ద్విచక్ర వాహనాలు, రెండు ఆటోలను సీజ్ చేశారు. డీఎస్పీ మాట్లాడుతూ, గ్రామాల్లో కొత్తవ్యక్తులు, నేరస్తులు షెల్టర్ తీసుకుంటే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గంజాయి, గుడుంబా, డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలని సూచించారు. సీఐలు కోటేశ్వర్, ఆరీఫ్ అలీఖాన్, ఎస్సైలు సతీశ్, వెంకట్‌రావు, కుమారస్వామి, సందీప్, ఏఎస్సై సత్తయ్య పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

### క్రీడాకారిణి స్వప్నికకు రూ.1.17లక్షల సాయం



విరాళాలు అందిస్తున్న మేనేజర్

ధర్మపురి: అంతర్జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు సాధించిన పట్టణంలోని విరంచి స్వప్నికకు సామాజిక మిత్రులు మంగళవారం రూ.1.17 లక్షలు సాయం చేశారు. మధ్య తరగతి కుటుంబానికి చెందినప్పటికి తల్లిదండ్రులు ఆమెను ఉన్నత చదువులు చదివిస్తూ, క్రీడల్లోనూ ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల షార్జాలో జరిగిన ఆసియా యూనివర్సిటీ స్థాయి పోటీల్లో ఆమె ప్రతిభ చూపింది. ఆమెకు ప్రోత్సాహం ఇవ్వాలని ధర్మపురికి చెందిన సామాజిక సేవకుడు రేణికుంట రమేశ్ ఫేస్‌బుక్‌లో పోస్టు వైరల్ చేశారు. దీంతో తెలుగు రాష్ట్రాలకు చెందిన ఎన్నారైలు, దాతలు స్పందించి స్వప్నిక తల్లి శ్రీలత బ్యాంక్ ఖాతాకు రూ.1.17 లక్షలు విరాళాలు జమచేశారు. స్థానిక ఎస్‌బీఐ మేనేజర్ దినేశ్ చేతుల మీదుగా స్వప్నికకు ఆ సొమ్ము అందజేశారు.

# ఆశావహుల్లో డాక్టర్లే ఎక్కువ!

- ఏడుగురు వైద్యులు, ముగురు డాక్టరేట్ పట్టభద్రులు
- బీటెక్ బాబులు, వకీల్‌సాబ్‌లకు కొదవేం లేదు
- అన్ని పార్టీల నుంచి గ్రాడ్యుయేట్లు
- ఆశావహుల్లో విద్యాధికులే అధికం




సాక్షిప్రతినిధి, కరీంనగర్:

అసెంబ్లీ ఎన్నికలకు అన్ని పార్టీలు సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలోని 13 నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీలు అభ్యర్థులను రంగంలోకి దింపే పనిలోపడ్డాయి. ఇందులో బీఆర్‌ఎస్ ఇప్పటికే అభ్యర్థులను ప్రకటించి ఒకడుగు ముందే వేయగా.. కాంగ్రెస్ ఆశావహుల నుంచి దరఖాస్తులు తీసుకుని కసరత్తు ప్రారంభించింది. ఇక బీజేపీ కూడా అభ్యర్థుల ఎంపికలో సీరియస్‌గానే పనిచేస్తోంది. మొత్తానికి అన్ని పార్టీల అభ్యర్థులకు అంగబలం, అర్థబలం, సామాజిక వర్గాలతోపాటు విద్యావంతులను ఎంపికచేసే పనిలోపడ్డాయి. ప్రస్తుతం పోటీకి సిద్ధంగా ఉన్న అధికార పార్టీ అభ్యర్థులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఆశావహులు దాదాపుగా ఉన్నత విద్యావంతులు కావడం విశేషం. అన్ని పార్టీలపరంగా ఆశావహుల విద్యార్హతలను పరిశీలిస్తే.. అందరిలో అధికంగా డాక్టర్లే ఎక్కువగా ఉండటం గమనార్హం. ఆ తర్వాతి స్థానాల్లో వకీల్‌సాబ్‌లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, బీటెక్‌బాబులు, గ్రాడ్యుయేట్లు ఉన్నారు. మొత్తానికి ఉమ్మడి జిల్లాలో ఈసారి అసెంబ్లీ బరిలో ఉన్నత విద్యావంతుల చాలామంది నిలవనున్నారు.

**పదిమంది పేర్ల ముందు డాక్టర్**

1. డాక్టర్ సంజయ్, ఎంఎస్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్-జగిత్యాల)
2. డాక్టర్ సంజయ్, ఎంఎస్, (బీఆర్‌ఎస్-కోరుట్ల)
3. డాక్టర్ భోగ శ్రావణి, బీడీఎస్ (బీజేపీ-జగిత్యాల)
4. డాక్టర్ వికాస్‌బాబు, ఎంబీబీఎస్ (బీజేపీ- వేములవాడ)
5. డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంఎస్ (కాంగ్రెస్-మానకొండూరు)
6. డాక్టర్ బల్మూరి వెంకట్, ఎంబీబీఎస్ (కాంగ్రెస్-హుజూరాబాద్)
7. డాక్టర్ జీఎన్ వెంకట్, ఎంబీబీఎస్ (బీజేపీ-కోరుట్ల)

**పీహెచ్‌డీ డాక్టర్లు**

8. డాక్టర్ రసమయి బాలకిషన్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్-మానకొండూరు)
9. డాక్టర్ కొనగాల మహేశ్ (కాంగ్రెస్-కరీంనగర్)
10. డాక్టర్ మేడిపల్లి సత్యం (కాంగ్రెస్-చొప్పదండి)

**వకీల్‌సాబ్‌లు వీరే..**

1. దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎల్ఎల్‌బీ ఎమ్మెల్యే (కాంగ్రెస్-మంథని)
2. టి.జీవన్‌రెడ్డి, ఎల్ఎల్‌బీ, ఎమ్మెల్సీ (కాంగ్రెస్-జగిత్యాల)
3. ఎ.మోహన్, ఎల్ఎల్‌బీ, మాజీ ఎమ్మెల్యే (మానకొండూరు)
4. కేకే మహేందర్‌రెడ్డి, ఎల్ఎల్‌బీ (కాంగ్రెస్-సిరిసిల్ల)

**ఇంజినీర్లు**

1. గంగుల కమలాకర్, బీటెక్(సివిల్) మంత్రి (బీఆర్‌ఎస్-కరీంనగర్)
2. దాసరి ఉష, ఐఐటీ ఖరగ్‌పూర్ (బీఎస్పీ- పెద్దపల్లి)
3. చలిమెడ లక్ష్మీనరసింహారావు, బీటెక్ (బీఆర్‌ఎస్- వేములవాడ)
4. వొడితెల సతీశ్‌బాబు, ఎంటెక్, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్-హుస్నాబాద్)
5. నక్కా విజయ్‌బాబు, బీటెక్ (బీజేపీ- ధర్మపురి)

**పోస్ట్ గ్రాడ్యుయేట్**

1. కేటీఆర్, ఎంబీఏ(యూఎస్‌ఏ), మంత్రి (బీఆర్‌ఎస్-సిరిసిల్ల)
2. కోరుకంటి చందర్, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్- రామగుండం)
3. దాసరి మనోహర్‌రెడ్డి, ఎంఏ, ఎమ్మెల్యే (బీఆర్‌ఎస్- పెద్దపల్లి)
4. పొన్నం ప్రభాకర్, ఎంఏ, మాజీ ఎంపీ (కాంగ్రెస్- హుస్నాబాద్)
5. సోమారపు సత్యనారాయణ, పీజీ (బీజేపీ-రామగుండం)
6. జువ్వాడి నర్సింగరావు, పీజీ (కాంగ్రెస్-కోరుట్ల)

**గ్రాడ్యుయేట్లు**

1. ఈటల రాజేందర్, బీఎస్సీ, ఎమ్మెల్యే (బీజేపీ-హుజూరాబాద్)
2. బండి సంజయ్, డిగ్రీ, ఎంపీ (బీజేపీ-కరీంనగర్)
3. రోహిత్‌రావు, గ్రాడ్యుయేషన్ (ఆస్ట్రేలియా) (కరీంనగర్-కాంగ్రెస్)
4. కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, గ్రాడ్యుయేట్ (కరీంనగర్-కాంగ్రెస్)

# కాంగి‘రేస్’లో 85 మంది!



- అత్యధికంగా కరీంనగర్‌కు, అత్యల్పంగా జగిత్యాలకు
- 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లోనూ హోరాహోరీ

సాక్షిప్రతినిధి,కరీంనగర్:

ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ ఆశావహుల జాబితా సిద్ధమైంది. రాష్ట్రంలో ఎన్నికలకు అధికార బీఆర్‌ఎస్ సమరశంఖం పూరించిన నేపథ్యంలో కాంగ్రెస్ కూడా పోటీకి నేతల నుంచి దరఖాస్తులు ఆహ్వానించింది. దీనికి లీడర్ల నుంచి అనూహ్య స్పందన వచ్చింది. ఉమ్మడి జిల్లాలోని 13 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 85 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో అత్యధికంగా కరీంనగర్‌కు 15 దరఖాస్తులు రాగా, అత్యల్పంగా జగిత్యాలకు ఒకే ఒక్క దరఖాస్తు రావడం గమనార్హం. గతంలోలా కాకుండా ఈసారి ఇప్పటికే తమ పార్టీ స్థితిగతులపై పలుదఫాలుగా సర్వేలు చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇపుడు ఆ సర్వే ఫలితాల ఆధారంగా టికెట్ కేటాయించనుందని సమాచారం. సామాజిక వర్గాలవారీగా ఓసీ, బీసీలు, ఎస్సీ, ఎస్టీలకు ధరావత్తు సొమ్ము చెల్లించి మరీ తమ ఆకాంక్షను పార్టీకి తెలియజేశారు. ఈనెల 25తో దరఖాస్తులకు గడువు ముగియడంతో వాటి పరిశీలన మొదలైంది. ఈ వడపోత కార్యక్రమం ముగిసిన తర్వాత దరఖాస్తు చేసుకున్న వారి వివరాలు ప్రకటిస్తారా? లేక కొత్తగా పార్టీలో చేరేవారికి దరఖాస్తుకు మరోసారి గడువు పెంచుతారా? అన్న విషయంలో ఇంకా స్పష్టత రావాల్సి ఉంది. ఇప్పటికే గాంధీభవన్ నుంచి ఢిల్లీ వరకు ఎవరి పైరవీలు వారు ప్రారంభించారు. తమకే టికెట్ కేటాయించాలని, ఒక్కచాన్స్, చివరి చాన్స్ అంటూ యత్నాలు చేస్తున్నారు.

**13 నియోజకవర్గాల్లో దరఖాస్తులు ఇలా..**

**కరీంనగర్-15:** రేగులపాటి రమ్యారావు, మేనేని రోహిత్‌రావు, డాక్టర్ కొనగాల మహేశ్, వైద్యుల అంజన్‌కుమార్, మొహమ్మద్ అబ్దుల్ షమీద్ (నవాబ్), కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి, కోమటిరెడ్డి పద్మాకర్‌రెడ్డి, పురమల్ల శ్రీనివాస్, జువ్వాడి నిఖిల్ చక్రవర్తి, రేగులపాటి రితీశ్‌రావు, సత్తు మల్లయ్య, కర్ర సత్యప్రసన్న, పడాల రాహుల్, ఎండీ రహమత్ హుస్సేన్, కొత్త జైపాల్‌రెడ్డి.

**చొప్పదండి-7:** మేడిపల్లి సత్యం, జిల్లాల భానుప్రియ, వెన్న రాజమల్లయ్య, కాశిపాక రాజేశ్, చిగురు శకుంతల, నాగి శేఖర్, మైక లక్ష్మణ్.

**మానకొండూర్-2:** డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, తిప్పారపు సంపత్.

**హుజూరాబాద్-13:** పాతి రామకృష్ణారెడ్డి, జాలి కమలాకర్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, ప్యాట రమేశ్, కె.బుచ్చిరెడ్డి, గూడెపు సారంగాపాణి, బల్మూరి వెంకట నర్సింగ్‌రావు, టి.రవీందర్, కశ్యప్ రెడ్డి ముద్దసాని, సాయిని, రవికుమార్, పూదరి రేణుక, దాసరి భూమయ్య, తిప్పారపు సంపత్.

**హుస్నాబాద్-06:** పొన్నం ప్రభాకర్, అల్గిరెడ్డి ప్రవీణ్‌రెడ్డి, వొంటెల లింగారెడ్డి, బాలిశెట్టి శివయ్య, వొంటెల రత్నాకర్, డాక్టర్ గజ్జెల మల్లేశ్.

**పెద్దపల్లి-05:** కిరణ్‌కుమార్ వెల్పుల, చింతకుంట విజయరమణారావు, గంట రాములు, చేతి ధర్మయ్య, ఈర్ల కొమురయ్య.

**రామగుండం-06:** ఎంఎస్ రాజ్‌ఠాకూర్, హర్కర వేణుగోపాల్‌రావు, బాబ్జీపాల్ జనక్‌ప్రసాద్, అంచర్ల మహేశ్ యాదవ్, రియాజొద్దీన్ అహ్మద్, గంట సత్యనారాయణరెడ్డి.

**మంథని-02:** దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, శివనాద్రి ప్రమోద్‌కుమార్.

**వేములవాడ-04:** ఆది శ్రీనివాస్, ఎం.చంద్రశేఖర్ యాదవ్, టి.అంజయ్యయాదవ్, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి.

**సిరిసిల్ల-04:** సంగీతం శ్రీనివాస్, చీటి ఉమేశ్‌రావు, నాగుల సత్యనారాయణ, కేకే మహేందర్‌రెడ్డి.

**జగిత్యాల-01:** తాటిపర్తి జీవన్‌రెడ్డి.

**కోరుట్ల-13:** కల్వకుంట్ల సుజిత్‌రావు, కోమొరెడ్డి జ్యోతిదేవి, జువ్వాడి నర్సింగరావు, రుద్ర శ్రీనివాస్, రుద్ర శంకర్, మొహమ్మద్ షకీర్ సిద్దిఖీ, కోమొరెడ్డి కరమ్ చంద్, కోట దుర్గారాజ్, కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి, ఆసిఫ్ హబీబ్, అలే పాండురంగా, మొహమ్మద్ హబీబ్ ఖాన్.

**ధర్మపురి-07:** అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, గజ్జెల స్వామి, వడ్లూరి కృష్ణ, గుమ్మడి కుమారస్వామి, బండారి కనుకయ్య, రవీందర్ మద్దెల, బొల్లి స్వామి.

# పట్టణాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

- పండుగలకు పకడ్బందీ ఏర్పాట్లు
- జగిత్యాల మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ వెల్లడి



రాఖీలు కడుతున్న మహిళా కౌన్సిలర్లు

జగిత్యాల: పట్టణాభివృద్ధే ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ అన్నారు. పురపాలక సంఘ కార్యాలయంలో మంగళవారం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎజెండాలోని 20అంశాలకు తొలుత కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అనంతరం శ్రీనివాస్ మాట్లాడారు. వచ్చే పండుగలకు పకడ్బందీ ఏర్పాట్లు చేశామని పేర్కొన్నారు. సెప్టెంబర్‌లో జరిగే పోచమ్మతల్లి ఉత్సవాల నిర్వహణకు రూ.2 లక్షలు, జంబిగద్దె హనుమాన్ గుడి అలంకరణ, మైక్ సెట్, డీజే సౌండ్ సిస్టమ్ కోసం రూ.24 లక్షలు, వినాయక నిమజ్జనం సందర్భంగా ప్రధాన రోడ్లపై సీసీ ప్యాచ్‌లు, జనరేటర్ సౌకర్యం కల్పన, నాటు తెప్పలు సమకూర్చడం కోసం రూ.36.50 లక్షలు, దసరా, సాయిబాబా పుణ్యతిథి కోసం రూ.1.50 లక్షలు, విశ్వకర్మ జయంతి కోసం రూ.లక్ష, ఇతర పనుల కోసం రూ.22 లక్షలు కేటాయించామని ఆయన తెలిపారు. పారిశుధ్యం నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కౌన్సిలర్లు ఆయన కోరారు. ఇటీవల మృతి చెందిన మున్సిపల్ వాటర్ సప్లయ్ లైన్‌మెన్ బీమ రాజానికి కౌన్సిల్ నివాళి అర్పించింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అనిల్‌బాబు, డీఈ రాజేశ్వర్, టీపీవో శ్రీనివాస్, టీపీఎస్ తేజస్వీని తదితరులు పాల్గొన్నారు.

**ముందస్తు రక్షాబంధన్..**

బల్దియాలో మహిళా కౌన్సిలర్లు ముందస్తు రక్షాబంధన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్, కౌన్సిలర్లకు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు.

# సమ్మె ఉద్యోగుల జన్మహక్కు

- షోకాజ్ నోటీసులకు భయపడేది లేదు
- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



సమ్మెలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

జగిత్యాలటౌన్: సమ్మె ఉద్యోగుల జన్మహక్కు అని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. తమ సర్వీసులను క్రమబద్ధీకరించాలని కోరుతూ రెండో ఏఎన్ఎంలు చేస్తున్న సమ్మె మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. స్థానిక ఆర్డీవో కార్యాలయ వద్ద చేపట్టిన దీక్ష శిబిరాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మితో కలిసి ఆయన మాట్లాడారు. షోకాజ్ నోటీసులతో ప్రభుత్వం భయపెడితే వెనక్కి తగ్గవద్దన్నారు. కాంగ్రెస్ అండగా ఉంటుందని చెప్పారు. ఆరోగ్య తెలంగాణ లక్ష్యంగా పనిచేస్తున్న రెండో ఏఎన్ఎంలను వెంటనే క్రమబద్ధీకరించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రెండో ఏఎన్ఎంల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాండ్ల మధురిమ, నాయకులు గూడూరి జయప్రద, నీరజ, పద్మ, ఎలిజబెత్, ఊర్మిళ, శిరీష, మేరీ, శారద, శిరీష తదితరులు పాల్గొన్నారు.

**సమగ్ర శిక్షా ఉద్యోగులకు న్యాయం చేయండి**

వివిధ హోదాల్లో పనిచేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులందరినీ వెంటనే రెగ్యులర్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేపట్టిన మూడోరోజు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన సందర్శించి సంఘీభావం తెలిపారు. అనంతరం మాట్లాడారు. సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**క్రమబద్ధీకరించండి**

జగిత్యాల: సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్‌సుందర్, అంబటి భూమేశ్ డిమాండ్ చేశారు. ఆందోళన చేస్తున్న సర్వ శిక్షా ఉద్యోగులకు వారు మద్దతు తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియామకమైన ఉద్యోగులు.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే రెగ్యులర్ అవుతామని ఆశగా ఉన్నారని, వెంటనే ప్రభుత్వం బేసిక్ పే మంజూరు చేస్తూ రెగ్యులరైజ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

# పనుల్లో వేగం పెంచండి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్



పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల: జిల్లా కేంద్రంలో చేపట్టిన వైద్య కళాశాల భవన నిర్మాణాన్ని వేగవంతం చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సూచించారు. మెడికల్ కాలేజీ భవన నిర్మాణాన్ని ఆయన మంగళవారం పరిశీలించి విలేకరులతో మాట్లాడారు. సీఎం కేసీఆర్ రూ.500 కోట్లు మంజూరు చేశారని, ఇటీవల మరో రూ.200 కోట్లు కేటాయించారని తెలిపారు. అనంతరం మాతా శిశు సంక్షేమ కేంద్రానికి మంజూరైన అంబులెన్స్‌ను ఆయన ప్రారంభించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ రాములు, ఆర్ఎంవో చంద్రశేఖర్, కౌన్సిలర్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆ తర్వాత ఎల్జీగార్డెన్స్‌లో జరిగిన రజక, నాయీబ్రాహ్మణ కుల సంఘాల సభ్యుల ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, మున్సిపల్ చైర్మన్ గోలి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ఆలయ అభివృద్ధికి నిధులు**

జగిత్యాలరూరల్: ఆలయాల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తోందని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. హస్నాబాద్ శ్రీభక్తాంజనేయస్వామి ఆలయంలో జరిగిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠలో ఆయన పాల్గొని పూజలు చేసి మాట్లాడారు. సర్పంచ్ లక్ష్మణ్‌రావు, ఎంపీటీసీ మల్లారెడ్డి, ఆలయ చైర్మన్ వెంకట్రావ్, ప్రధాన కార్యదర్శి సాగర్‌రావు ఉన్నారు.

### సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



సూచనలిస్తున్న డీఎంహెచ్‌వో శ్రీధర్

రాయికల్(జగిత్యాల): సీజనల్ వ్యాధులపై వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఎంహెచ్‌వో శ్రీధర్ సూచించారు. రామాజీపేటలో ఇటీవల డెంగీతో మృతిచెందిన గోనె మోక్ష ఇంటిని మంగళవారం ఆయన సందర్శించారు. బాలిక చికిత్స పొందిన ఆస్పత్రుల వివరాల గురించి కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీజనల్ వ్యాధుల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. తర్వాత బోర్నపల్లి ఆరోగ్య ఉప కేంద్రాన్ని సందర్శించారు. మండల వైద్యాధికారి సతీశ్‌కుమార్, సూపర్‌వైజర్ ప్రమీల, ఫార్మసిస్ట్ దీపిక తదితరులు పాల్గొన్నారు.

# అనురాగానికి ప్రతీక రక్షాబంధన్

- జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత



ఉపాధ్యాయ సంఘం నాయకుడికి రాఖీ కడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాలరూరల్: అన్నాచెల్లెల ఆత్మీయ అనురాగానికి రక్షాబంధన్ ప్రతీకగా నిలుస్తుందని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. జిల్లా పరిషత్ కార్యాలయంలో బ్రహ్మకుమారీస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్షాబంధన్ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతిలో అనుబంధాలకు ప్రథమ ప్రాధాన్యం ఇచ్చారన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈవో రామాజచారి, డీపీవో నరేశ్, ఈఈ రహమాన్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, కథలాపూర్ మాజీ ఏఎంసీ చైర్మన్ నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

**క్రీడలతో మానసిక దృఢత్వం**

క్రీడలు మానసిక దృఢత్వానికి దోహదపడతాయని జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. హాకీ క్రీడాకారుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా స్థానిక మినీస్టేడియంలో జిల్లాస్థాయి ఆటల పోటీలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయన్నారు. గెలుపు, ఓటములు సమానంగా స్వీకరించి, క్రీడాకారులు నైపుణ్యాన్ని మెరుగుపర్చుకోవాలని సూచించారు. జిల్లాలో క్రీడల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ దివాకర, డీవైఎస్‌వో రవికుమార్, ఎస్జీఎఫ్ సెక్రటరీ నాయక్, డీడబ్ల్యూవో నరేశ్ పాల్గొన్నారు.

# కుల బహిష్కరణపై విచారణ

- వివరాలు సేకరించిన డీపీవో



విచారణ జరుపుతున్న డీపీవో దేవరాజ్

కథలాపూర్(వేములవాడ): చింతకుంట గ్రామంలో కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా పంచాయతీ అధికారి దేవరాజ్ మంగళవారం విచారణ జరిపారు. మున్నూరుకాపు కులసంఘం సభ్యులు తనను కుల బహిష్కరణ చేశారని గ్రామానికి చెందిన గాండ్ల దేవయ్య ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో డీపీవో గ్రామానికి చేరుకున్నారు. కులసంఘం సభ్యులను గ్రామ కూడలికి పిలిపించారు. అక్కడ గ్రామసభ ఏర్పాటు చేసి సంఘటనకు సంబంధించిన వివరాల గురించి గ్రామస్తులు, బాధితుడిని అడిగి తెలుసుకున్నారు. ప్రజలు కలిసిమెలిసి ఉండాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎల్పీవో శంకర్, తహసీల్దార్ ముంతాజిబొద్దీన్, ఎంపీవో గంగాధర్, జెడ్పీటీసీ నాగం భూమయ్య, ఎంపీటీసీ బాలు, సర్పంచ్ భైర హేమలత, కార్యదర్శి మోహన్ పాల్గొన్నారు.

# జిల్లాలో కలకలం

- కోరుట్లలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ దీప్తి అనుమానాస్పద మృతి
- రాయికల్ పట్టణంలో పట్టపగలే మహిళ దారుణ హత్య



దీప్తి(ఫైల్)



జల(ఫైల్)

**కోరుట్ల/రాయికల్: జిల్లాలోని రాయికల్ పట్టణంలో కోల జల(48) మంగళవారం పట్టపగలే దారుణ హత్యకు గురైంది. ఇంట్లో నిద్రిస్తున్న ఆమెపై దుండగులు దాడిచేసి తీవ్రంగా కొట్టారు. తీవ్రగాయాలతో ఆమె మంచంలోనే ప్రాణాలు కోల్పోయింది. పుస్తెల తాడు చోరీ చేసే సమయంలో ప్రతిఘటించడంతోనే అగంతకులు ఆమెను చంపారని పోలీసులు భావిస్తున్నారు. మరోవైపు.. కోరుట్ల పట్టణంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి(24) సోమవారం రాత్రి అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం కలకలం రేపింది. దీప్తి చనిపోయాక ఆమె చెల్లెలు కనిపించకుండా పోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ రెండు సంఘటనలు జిల్లాలో కలకలం సృష్టించాయి.**

- వివరాలు 8లో▸

## క్లుప్తంగా

### హామీలు అమలు చేయాలి



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ధర్మపురి: గత ఎన్నికల్లో రాష్ట్రప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని దళిత మోర్చా రాష్ట్ర కార్యదర్శి చంద్రశేఖర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ ధర్మపురి పట్టణంలో మంగళవారం బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఒక్కరికి దళితబంధు, బీసీబంధు, మైనార్టీబంధు, దళితులకు మూడెకరాల భూమి తదితర పథకాలను అందించాలని డిమాండు చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేశం, ప్రధాన కార్యదర్శి పిల్లి శ్రీనివాస్, అధికార ప్రతినిధి మర్రిపెల్లి సత్యం, ఎంపీటీసీ ఆకుబత్తిని తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

### కుష్ఠు నిర్ధారణ పరీక్షలు



పరీక్షలు చేస్తున్న వైద్యులు

ధర్మపురి: మండలంలోని నేరెల్ల పీహెచ్‌సీలో మంగళవారం కుష్ఠు నిర్ధారణ పరీక్షలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్ధారణ పరీక్షలతో పాటు ఆరోగ్య మహిళా కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాధి నిర్ధారణ అయినవారికి ఆరునెలల పాటు ఉచితంగా అన్ని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మందులు ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు శివకుమార్, హెచ్‌ఈవో రాజేశం, సతీష్‌కుమార్ తదితరులున్నారు.

### కరెంట్ షాక్‌తో రైతు మృతి



రాజిరెడ్డి (ఫైల్)

పెగడపల్లి(ధర్మపురి): ప్రమాదవశాత్తు కరెంటు షాక్‌తో రైతు మృతిచెందిన ఘటన పెగడపల్లి మండలం మ్యాకవెంకయ్యపల్లిలో మంగళవారం జరిగింది. ఎస్సై సతీశ్ వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు నల్ల రాజిరెడ్డి (65) తన పంట పొలం వద్దకు నీరు పెట్టేందుకు వెళ్లాడు. వ్యవసాయ పంపుసెట్ ఆన్ చేసి మోటారు చుట్టూరా ఉన్న పచ్చిగడ్డిని కోస్తున్న క్రమంలో పంపుసెట్‌కు చేయి తగిలింది. పంపుసెట్‌కు విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురై అక్కడికక్కడే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని సందర్శించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

### గుండెపోటుతో పోస్ట్‌మాస్టర్..



కొండలాద్రి (ఫైల్)

మల్లాపూర్(కోరుట్ల): మండల కేంద్రానికి చెందిన బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ ఎగ్యారపు కొండలాద్రి (54) గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికుల వివరాలు.. కొండలాద్రి కొన్నేళ్లుగా బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. అతడికి భార్య శ్రీదేవి, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పిల్లందరికీ వివాహాలు జరిగాయి. మంగళవారం సాయంత్రం కొండలాద్రి గుండెపోటుతో కుప్పకూలిపోవడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన మెట్‌పల్లిలోని ప్రైవేటు అసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. కొండలాద్రి మృతిపై స్థానిక ప్రజాప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు.

# అసలేం జరిగింది..!?

- సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అనుమానాస్పద మృతి
- ఇంట్లో ఉన్నది అక్కాచెల్లెళ్లు మాత్రమే
- యువకుడితో చెల్లి వెళ్లిపోయిందా..?
- బస్టాండ్ సీసీ ఫుటేజీల్లో దృశ్యాలు



దీప్తి మృతదేహం



కోరుట్ల బస్టాండ్ సీసీ ఫుటేజీలో యువకుడితో చందన

కోరుట్ల: 'సోమవారం రాత్రి ఆ ఇంట్లో అక్కాచెల్లెళ్లు మాత్రమే ఉన్నారు. తెల్లారేసరికి అక్క చనిపోయి సోఫాలో పడి ఉంది. ఇంటి బయట తలుపునకు గొళ్లెం పెట్టి చెల్లి ప్రియుడితో కలిసి పరారైంది'. ఇంట్లోని కిచెన్‌లో ఓడ్కా, బ్రీజర్ బాటిళ్లు ఉన్నాయి. అసలు ఆ రాత్రి ఇంట్లో ఏం జరిగి ఉంటుంది..? అక్క చనిపోవడానికి చెల్లెలే కారణమా..? ప్రియుడితో కలిసి చెల్లె వెళ్లిపోతుంటే అక్క అడ్డుకున్న క్రమంలో గొడవ జరిగిందా.. ఈ గొడవలోనే అక్క ప్రాణాలు పోయాయా..? లేదా ఓడ్కాలో అక్కకు మత్తు ఇచ్చి చెల్లెలు గుర్తు తెలియని యువకుడితో కలిసి పరారైందా..? వోడ్కాలో కలిపిన మత్తు మందు డోసు ఎక్కువై అక్క చనిపోయిందా..?!

**అనేక అనుమానాలు**

కోరుట్లకు చెందిన సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బంక దీప్తి మృతి వెనక లెక్కలేని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఆంధ్రకు చెందిన బంక శ్రీనివాస్‌రెడ్డి–మాధవి దంపతులు సుమారు పాతికేళ్లుగా కోరుట్లలోని భీమునిదుబ్బలో స్థిరపడ్డారు. ఇటుకబట్టీ వ్యాపారం చేసుకునే శ్రీనివాస్‌రెడ్డికి కుమారుడు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కుమారుడు బెంగళూర్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. పెద్ద కూతురు దీప్తి(24) పుణేలోని ఓ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా వర్క్‌ఫ్రం హోం పద్ధతిన ఇంట్లో నుంచి పనిచేస్తోంది. చిన్నకూతురు చందన ఇటీవల బీటెక్ పూర్తి చేసింది. సోమవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి–మాధవి హైదరాబాద్‌లోని బంధువుల గృహప్రవేశం కార్యక్రమానికి వెళ్లగా దీప్తి, చందన మాత్రమే ఇంట్లో ఉన్నారు. రాత్రి 10 గంటల వరకు తండ్రితో అక్కాచెల్లెళ్లు ఫోన్‌లో మాట్లాడినట్లు సమాచారం.

**తెల్లారేసరికి..**

మంగళవారం ఉదయం శ్రీనివాస్‌రెడ్డి తన కూతుళ్లతో మాట్లాడటానికి ప్రయత్నించగా పెద్ద కూతురు దీప్తి ఫోన్ లిఫ్ట్ కాలేదు. చిన్నకూతురు చందన ఫోన్ స్విచ్ ఆఫ్ వచ్చింది. రెండుమూడు సార్లు ఫోన్‌లో కూతుళ్లతో మాట్లాడేందుకు ప్రయత్నించిన శ్రీనివాస్‌రెడ్డి చివరికి పక్క ఇంట్లో ఉన్న వారికి ఫోన్ చేశాడు. తమ కూతుళ్ల ఫోన్ ఎత్తడం లేదని చెప్పి, ఓ సారి ఇంటిదాకా వెళ్లి చూడమని కోరాడు. పక్క ఇంట్లో ఉండే ఓ మహిళ మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో శ్రీనివాస్‌రెడ్డి ఇంట్లోకి వెళ్లి చూడగా తలుపు బయట నుంచి గొళ్లెం పెట్టి ఉంది. పిలిస్తే ఎవరూ పలకలేదు. దీంతో తలుపు గొళ్లెం తీసి లోపలికి వెళ్లి చూడగా పెద్ద కూతురు దీప్తి సోఫాలో పడిపోయి ఉంది. చుట్టుపక్కల వారికి విషయం చెప్పగా వారు దీప్తిని పరిశీలించి అప్పటికే చనిపోయినట్లు గుర్తించారు. బంధువులు, పోలీసులకు సమాచారం ఇవ్వగా మెట్‌పల్లి డీఎస్పీ వంగ రవీందర్‌రెడ్డి, సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సైలు కిరణ్, చిరంజీవి ఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

**ఆ రాత్రి ఏం జరిగినట్లు..?**

సోమవారం ఉదయం తల్లిదండ్రులు హైదరాబాద్‌లోని బంధువు ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లగా రాత్రి అక్కాచెల్లెల్లు ఇద్దరే ఇంట్లో ఉన్నారు. కిచెన్‌లో వోడ్కా, బ్రీజర్ బాటిళ్లు, వెనిగర్, నిమ్మకాయలు ఉండటంతో రాత్రి వేళ దీప్తి, చందన కలిసి మద్యం సేవించారా..? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. వీరికి మద్యం బాటిళ్లు ఎవరు తెచ్చి ఇచ్చారు, ప్రియుడితో కలిసి పరారయ్యేందుకు ముందుగానే పథకం వేసుకున్న చందన అతడితోనే మద్యం తెప్పించి ముగ్గురు కలిసి మద్యం తీసుకున్నారా..? అన్న విషయంలో స్పష్టత లేదు. దీప్తికి మద్యంలో మత్తు కలిపి తాము పరారయ్యేందుకు పథకం వేశారా..? మత్తు డోసు ఎక్కువ కావడంతో దీప్తి మృతి చెంది ఉంటుందా..? అన్న అనుమానాలున్నాయి. చందన ప్రియుడితో కలిసి వెళ్లిపోయే ప్రయత్నాన్ని దీప్తి అడ్డుకునే క్రమంలో గొడవ జరిగి ఆ గొడవలో తగలరాని చోట దెబ్బతగిలి దీప్తి చనిపోయిందా..? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. దీప్తి శరీరంపై పెద్దగా గాయాలు కనిపించకపోవడం ప్రశ్నార్థకంగా మారింది.

**బస్టాండ్ సీసీ ఫుటేజీలో చందన..**

కోరుట్ల బస్టాండ్‌లోని సీసీ కెమెరాల్లో మంగళవారం వేకువజామున 5 గంటలకు చందన ఓ యువకుడితో కలిసి ఉన్న వీడియోలను పోలీసులు గుర్తించారు. చందన, మరో యువకుడు లగేజీ తీసుకుని నిజామాబాద్‌వైపు వెళ్లే బస్సు ఎక్కినట్లు సీసీ ఫుటేజీల్లో రికార్డు అయింది. చందన ఫోన్ కాల్ డేటా ఆధారంగా ఆమె ఓ యువకుడితో గంటల తరబడి ఫోన్ మాట్లాడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. మంగళవారం రాత్రి చందన ఫోన్ లొకేషన్ హైదరాబాద్‌లో వస్తున్నట్లుగా పోలీసులు గుర్తించారని సమాచారం. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కోరుట్ల సీఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

# పట్టపగలే మహిళ దారుణహత్య

- ముఖంపై పిడిగుద్దులు.. పుస్తెలతాడు చోరీ
- ఘటన స్థలాన్ని పరిశీలించిన డీఎస్పీ



జల మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ

రాయికల్:(జగిత్యాల): రాయికల్ పట్టణంలోని నాగారంవాడలో మంగళవారం పట్టపగలే కోల జల (48) దారుణహత్యకు గురైంది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. జల భర్త సత్తయ్య, కొడుకు శేఖర్ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలకు వెళ్లారు. కూతురు రమ్యను ఇదే గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. జల తన ఇంట్లో ఒక్కతే నివసిస్తోంది. శ్రావణమాసం సందర్భంగా మంగళవారం ఉదయం పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయానికి వెళ్లి పూజలు చేసింది. మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో భోజనం చేసి నిద్రిస్తుంది. ఇదే అదునుగా భావించిన గుర్తుతెలియని వ్యక్తులు ఇంట్లోకి ప్రవేశించి జల పుస్తెలతాడును దోచుకెళ్లే క్రమంలో ఆమె ముఖంపై పిడిగుద్దులు గుద్దడంతో అక్కడికక్కడే మృతిచెందింది. రోజూ సాయంత్రం పూట ఆరుబయటకు వచ్చే జల రాకపోవడంతో గమనించిన స్థానికులు ఇంట్లోకి వెళ్లి చూడగా మంచంపై రక్తం మరకలతో బోర్లాపడి ఉంది. స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. డీఎస్పీ వెంకటస్వామి, రూరల్ సీఐ ఆరీఫ్‌ఖాన్ ఘటన స్థలానికి చేరుకున్నారు. డాగ్‌స్క్వాడ్, క్లూస్‌టీంలతో ఆధారాలు సేకరించారు. అనంతరం డీఎస్పీ విలేకరులతో మాట్లాడుతూ.. కోల జలను దుండగులు హత్య చేసి పుస్తెలతాడును దోచుకెళ్లినట్లు తెలిపారు. మృతురాలి కూతురు రమ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై దేవేందర్‌నాయక్ తెలిపారు. ఏదేమైనా రాయికల్ పట్టణంలో పట్టపగలే మహిళ హత్యకు గురికావడంతో ప్రజలు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు.

# పుట్టిన రోజునే అంతిమయాత్ర

- గుండెపోటుతో వ్యక్తి మృతి
- తలకొరివి పెట్టిన కూతురు



తండ్రి అంతిమయాత్రలో సంజన

మెట్‌పల్లి(కోరుట్ల): పుట్టిన రోజునే ఓ వ్యక్తి అంతిమయాత్ర నిర్వహించడం అక్కడున్నవారిని కలచివేసింది. కొడుకులు లేని ఆ తండ్రికి కూతురే అన్నీ తానై కొరివి పెట్టింది. ఈ విషాదకర ఘటన మెట్‌పల్లి పట్టణ శివారులోని అర్బన్ కాలనీలో చోటుచేసుకుంది. స్థానికుల వివరాలు.. మెట్‌పల్లి పట్టణానికి చెందిన చిలుక వినోద్(45)కు భార్య లత, కూతుళ్లు సంజన, సహస్ర ఉన్నారు. వినోద్ కుటుంబ పోషణ కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తున్నాడు. సోమవారం డ్యూటీకి వెళ్లిన వినోద్‌కు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. దీంతో హుటాహుటిన హైదరాబాద్ ఉస్మానియా ఆసుపత్రికి తరలించగా, చికిత్సపొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని మెట్‌పల్లి అర్బన్ కాలనీకి తరలించి మంగళవారం అంత్యక్రియలు నిర్వహించారు. కాగా వినోద్‌కు వారసులు లేకపోవడంతో పెద్ద కూతురు సంజనే అన్నీ తానై తండ్రికి తలకొరివి పెట్టింది. చిన్న వయసులోనే తండ్రి చితికి నిప్పు పెడుతున్న కూతురుని చూసిన కాలనీవాసులు కంటతడి పెట్టారు. మరోవైపు వినోద్ పుట్టిన రోజు, అంతిమయాత్ర ఒకేరోజు కావడం ప్రతి ఒక్కరిని విషాదంలో ముంచెత్తింది. ఇంటి పెద్ద దిక్కు కోల్పోయిన వినోద్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని స్థానికులు కోరారు.

# సమస్యలపై అవగాహన లేదు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతు ఇవ్వొద్దు
- బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి



కొచ్చెరువును పరిశీలిస్తున్న నాయకులు

కథలాపూర్(వేములవాడ): ఈ ప్రాంత సమస్యలపై అవగాహనలేని బీఆర్ఎస్ వేములవాడ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావుకు ప్రజలు మద్దతు ఇవ్వొద్దని బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా అధ్యక్షుడు కొడిపెల్లి గోపాల్‌రెడ్డి కోరారు. మంగళవారం కథలాపూర్ మండలం గంభీర్‌పూర్ గ్రామ శివారులో ఇటీవల కురిసిన వర్షాలకు గండిపడిన కొచ్చెరువును బీజేపీ నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. గండిపడిన చెరువుకు త్వరగా మరమ్మతులు చేయించడంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు విఫలమయ్యారన్నారు. గంభీర్‌పూర్ శివారులో 600 ఎకరాల భూమిలో హార్టికల్చర్ యూనివర్సిటీ ఏర్పాటుకు ప్రతిపాదించి, దాన్ని సీఎం కేసీఆర్ సొంత జిల్లాకు తీసుకుపోయారని విమర్శించారు. ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో తరుగు పేరిట క్వింటాలుకు ఆరు కిలోలు కోత విధించారని, చిత్తశుద్ధి ఉంటే రైతుల వద్ద దోపిడీ చేసిన ధాన్యాన్ని తిరిగి ఇప్పించాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థిని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో రైతుల సంక్షేమం కోసం కృషి చేస్తున్న బీజేపీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు గట్ల అంజయ్య, చిలివేరి జనార్దన్, జలేందర్‌రెడ్డి, రఘు, సాయికృష్ణ, నరెడ్ల రవి, కిశోర్, నగేశ్ తదితరులు పాల్గొన్నారు.

## వడ్డెర కార్పొరేషన్‌కు ఎన్ని నిధులు కేటాయించారు?

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

సారంగాపూర్(జగిత్యాల): వడ్డెర కార్పొరేషన్‌కు ఎన్ని నిధులు వెచ్చించారని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ప్రశ్నించారు. మంగళవారం వడ్డెరకాలనీకి చెందిన పలువురు ఎమ్మెల్సీ సమక్షంలో కాంగ్రెస్‌పార్టీలో చేరారు. వారికి ఆయన కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, వడ్డెరులు శ్రమకు ప్రతిరూపమన్నారు. వారిని ఎస్టీ జాబితాలో కలపాలన్న అంశం సీఎం కేసీఆర్ పాలనలో కనుమరుగైందని విమర్శించారు. వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేసినా దానికి నిధులు కేటాయించకపోవడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మాలెపు విమల, ఉపసర్పంచ్ రవి తదితరులు ఉన్నారు.

## అటవీ అధికారులకు నెమలి అప్పగింత



నెమలిని అప్పగిస్తున్న ఖలీల్

బుగ్గారం(ధర్మపురి): వెల్గొండ గ్రామానికి చెందిన ఖలీల్ వ్యవసాయ బావిలో పడిన నెమలిని రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించాడు. ఈ సంఘటన మంగళవారం జరిగింది. గ్రామానికి చెందిన ఖలీల్ తన వ్యవసాయ బావిలో పడిఉన్న జాతీయ పక్షి నెమలిని గుర్తించి సర్పంచ్ తిరుపతికి సమాచారం అందించాడు. దానిని బయటకు తీసి పశువైద్యాధికారులతో తొలుత చికిత్స చేయించారు. అనంతరం అటవీ అధికారి జీవన్‌కు నెమలిని అప్పగించాడు.

### జేఎన్టీయూలో 'ఓరియంటేషన్'

కొండగట్టు(చొప్పదండి): కొడిమ్యాల మండలం నాచుపెల్లి జేఎన్టీయూలో మంగళవారం ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులు, తల్లిదండ్రులకు వసతుల గురించి ప్రిన్సిపాల్ రమేశ్ వివరించారు. ఈకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ టి.వేణుగోపాల్, ఆచార్యులు శ్రీనివాస్, వసంత్‌కుమార్, ధీరజ్ తదితరులు పాల్గొన్నారు.

### మహిళ అదృశ్యం

జగిత్యాలక్రైం: జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. ఆమె తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై సదాకర్ తెలిపారు. సదరు మహిళ సోమవారం సాయంత్రం 6.30 గంటల సమయంలో కిరాణం షాపునకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆచూకీ దొరక్కలేదు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## యావర్ రోడ్డు విస్తరణ ఎన్నికల స్టంటే..



బల్దియా కార్యాలయానికి వస్తున్న బీజేపీ శ్రేణులు



కార్యాలయంలోకి వెళ్లేందుకు యత్నిస్తున్న నాయకులు

- బీజేపీ శ్రేణుల విమర్శ

జగిత్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని యావర్ రోడ్డు విస్తరణకు జారీచేసిన జీవో ఎన్నికల స్టంట్ అని బీజేపీ నాయకుడు ముదుగంటి రవీందర్‌రెడ్డి విమర్శించారు. యావర్‌రోడ్డు విస్తరణలో జాప్యాన్ని నిరసిస్తూ బీజేపీ శ్రేణులు మంగళవారం బల్దియా ముట్టడికి యత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో అక్కడే బైఠాయించి నిరసన తెలిపారు. ఈ క్రమంలో రెండు వర్గాల మధ్య తోపులాట జరిగింది. అనంతరం నాయకులు మాట్లాడారు. బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్‌కుమార్‌ను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వంద రోజుల్లోనే యావర్‌రోడ్డు విస్తరిస్తామని గత ఎన్నికల్లో మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చారని, ఎమ్మెల్యే పదవీకాలం మరో వంద రోజుల్లో ముగుస్తుందని, విస్తరణ పనులు ఇంకెప్పుడు చేపడతారని ప్రశ్నించారు. మాట తప్పారనే విమర్శల నేపథ్యంలో జీవో తీసుకొ ప్రజలు, ప్రతిపక్షాల నోరు మూయించే ప్రయత్నం చేస్తున్నారని దుయ్యబట్టారు. నాయకులు ఏసీఎస్ రాజు, సీపెల్లి రవీందర్, లింగంపేట శ్రీనివాస్, ఆంకారి సుధాకర్, అల్లాల భగవంతరావు, చీటి చంద్రశేఖర్‌రావు, గుర్రం రాము, అరవ లక్ష్మి, బుర్ర ప్రమోద్, జ్ఞానేశ్వర్, బిట్టు పాల్గొన్నారు.

### విధులకు ఆటంకం కలిగించిన వ్యక్తిపై కేసు

జగిత్యాలక్రైం: జగిత్యాల పశువైద్య శాఖలో మొబైల్ వెటర్నరి అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న రాపాక మానస విధులకు ఆటంకం కలిగించిన అక్బర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సదాకర్ తెలిపారు. మానస ఈనెల 23న ఉదయం 9 గంటలకు చల్‌గల్ గ్రామానికి వెళ్తుండగా చల్‌గల్‌కు చెందిన అక్బర్ వారి అంబులెన్స్‌ను అడ్డుకున్నాడు. గతంలో మీరు వైద్యం సరిగా చేయకపోవడంతో తన పశువు మృతిచెందిందని తిడుతూ అంబులెన్స్ తాళాలు లాక్కుని వారి విధులకు ఆటంకం కలిగించాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని వైద్యురాలిని ఫోన్‌లో బెదిరిస్తుండటంతో బాధితురాలు మంగళవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

**మోసం చేసిన వ్యక్తిపై..**

జగిత్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని భవానీనగర్‌కు చెందిన నక్క లక్ష్మీతో పాటు మరో ఇద్దరికి రుణం ఇప్పిస్తానని మోసం చేసిన మోహన్‌పై మంగళవారం కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ నటేశ్ తెలిపారు. నక్క లక్ష్మి జగిత్యాలోని ఆనంద్ హోటల్‌లో దినసరి కూలీగా పనిచేస్తుంది. మోహన్ మాయమాటలు చెప్పి లక్ష్మితో పాటు బైతపు కమల, దాసరి భూమయ్యకు ఒక్కొక్కరికి రూ.3లక్షల చొప్పున బ్యాంకులో రుణం ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీనికి మోహన్ ఖర్చుల కింద ఒక్కొక్కరి నుంచి రూ.10 వేల చొప్పున తీసుకున్నాడు. తర్వాత కనిపించకుండా పోయాడు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ పేర్కొన్నారు.

# విస్తరణకు గ్రీన్‌సిగ్నల్!

- యావర్ రోడ్డుకు మహర్దశ
- టీడీఆర్ జారీకి ఉత్తర్వులు
- వేగవంతం కానున్న పనులు
- తప్పనున్న బల్దియావాసుల ఇబ్బందులు



విస్తరణకు మార్గం సుగమమైన యావర్‌రోడ్డు

జగిత్యాల: జిల్లా కేంద్రంలో అతిప్రధానమైన, నిత్యం రద్దీగా ఉండే యావర్‌రోడ్డు(ఎన్‌హెచ్ – 63 జాతీయ రహదారి) విస్తరణకు ఆటంకాలు తొలగినట్లయ్యింది. నిత్యం రద్దీగా ఉండడంతోపాటు తరచూ ప్రమాదాలకు నిలయంగా మారిన ఈ రహదారిని విస్తరించాలని బల్దియావాసులు దశాబ్దాలుగా డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలోనే మున్సిపల్ పాలకవర్గం గతంలో రోడ్డు విస్తరణ చేపట్టింది. దీనిద్వారా తమకు తీరని నష్టం వాటిల్లుతోందంటూ పలువురు భవన యజమానులు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు స్తంభించాయి.

**ప్రభుత్వ కార్యాలయాల వరకే..**

- తొలుత యావర్ రోడ్డును అటవీ, ఆర్డీవో కార్యాలయాల వరకు వంద అడుగుల వెడల్పుతో విస్తరించారు.
- ఇందుకోసం ఆ కార్యాలయాల భవనాలు కూల్చివేశారు.
- ఆ తర్వాత ప్రైవేట్ భవనాలు ఉండటం, రోడ్డు విస్తరణకు వాటిని కూల్చివేయాల్సి రావడంతో యజమానులు అంగీకరించలేదు.
- అత్యధిక విలువైన స్థలాలు, భవనాలు కోల్పోతున్నామంటూ కొందరు కోర్టును ఆశ్రయించారు. దీంతో పనులు ముందుకు సాగలేదు.
- అయితే, ఇరుకైన రోడ్డు కావడం, వాహనాలు, జనాల రద్దీ అధికంగా ఉండడంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.
- ఈ సమస్య బల్దివాసులను తీవ్రంగా వేధిస్తుండడంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లారు.
- దీంతో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ అధికారులు జగిత్యాల మున్సిపాలిటీలో ట్రాన్స్‌ఫర్ ఆఫ్ డెవలప్‌మెంట్ రైట్స్(టీడీఆర్) సర్టిఫికెట్లు జారీచేసేలా సోమవారం మెమో విడుదల చేశారు.

**టీడీఆర్‌తో ఇవీ ప్రయోజనాలు..**

మున్సిపాలిటీ పరిహారం చెల్లించలే వీలు లేకపోవడం, భవనాలు, స్థలాలు కోల్పోయే యజమానులకు నష్టం వాటిల్లకుండా, రోడ్డు విస్తరణకు ఆటంకాలు ఎదురవకుండా టీడీఆర్ ఎంతో దోహదం చేస్తుందని అధికారులు చెబుతున్నారు. ఈ సర్టిఫికెట్ పొందిన యజమాని రోడ్డు విస్తరణలో భవనం, స్థలం కోల్పోతే.. నాలుగు రెట్ల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకునేందుకు వీలుంటుందని అంటున్నారు. అంటే.. ఓ యజమాని 20 చదరపు గజాలు రోడ్డు కోల్పోతే.. 80 గజాల విస్తీర్ణంలో భవనం కట్టుకోవడానికి వీలుగా టీడీఆర్ సర్టిఫికెట్ జారీ చేస్తారని పేర్కొంటున్నారు.

**విక్రయించనూ వచ్చు..!**

- టీడీఆర్ సర్టిఫికెట్ పొందిన యజమాని తన కున్న ప్రాంతంలో నాలుగు రెట్ల విస్తీర్ణంలో భవనం నిర్మించుకోవచ్చని, లేదా దీనిని విక్రయించుకునే వీలు కూడా ఉందని అధికారులు విశ్లేషిస్తున్నారు.
- ఇలాంటివి జీహెచ్ఎంసీ పరిధిలోని అపార్ట్‌మెంట్లు, ఇతర భవనాల్లో ప్రస్తుతం అమల్లో ఉందని ఉదహరిస్తున్నారు.
- వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినా అత్యధిక ధర పలుకుతుందని పేర్కొంటున్నారు.
- మొత్తంగా యావర్‌రోడ్డు విస్తరణలో జిల్లా కేంద్రంలో దాదాపు 284 మంది యజమానులు భవనాలు కోల్పోయే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు.

**ప్రణాళిక రూపొందిస్తున్న అధికారులు..**

టౌన్ ప్లానింగ్ అధికారులు రోడ్డు విస్తరణకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. వరంగల్ నుంచి మంగళవారం ఆర్డీటీ అధికారులు జగిత్యాల చేరుకున్నారు. భవనాలు, విస్తరణలో కోల్పోయే శాతంపై అంచనాలు తయారు చేస్తున్నారు. తొలుత విస్తరణకు మార్క్ చేశాక.. యజమానులకు టీడీఆర్ సర్టిఫికెట్ల కోసం నోటీసులు జారీచేసేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తయ్యాక భవన యజమానులకు సంపూర్ణ అవగాహన కల్పించి ముందుకు సాగుతారు. 15 రోజుల్లోపు ఈ ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు.

**మంచి అవకాశం**



యావర్‌రోడ్డు విస్తరణకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. టీడీఆర్ సర్టిఫికెట్లు ఇందుకు దోహదపడతాయి. నిర్వాసితుల ప్రస్తుత ఆస్తికి నాలుగు రెట్లు లబ్ధి కలుగుతుంది. మంత్రులు కేటీఆర్, కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీలు కవిత, ఎల్.రమణకు కృతజ్ఞతలు.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే